క్లుప్తంగా

పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు

లింగాలఘణపురం: మండలంలోని పంచాయతీ సిబ్బందికి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణలత ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ రఘురామకృష్ణ, డాక్టర్ కిరణ్, ఆరోగ్య కేంద్ర, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'

జఫర్‌గఢ్: గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి గుండెబోయిన రాజు అన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గ్రామాలు సమస్యలకు నిలయాలుగా మారయన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా అంతర్గత రోడ్లు, డ్రైయినేజీ తదితర సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాట సుధాకర్, ఎండి షబానా, రాయపురం భిక్షపతి, రాపర్తి రజిత పాల్గొన్నారు.

నియామకం



తరిగొప్పుల: కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్‌గా మండలకేంద్రానికి చెందిన ఎడ్ల నవీన్ శనివారం నియమితులయ్యారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాన్ని నవీన్ అందుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి, పండుగ కనుకయ్య, పోషయ్య, బైకాని బాలరాజు, ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఊరెళ్తే సమాచారం ఇవ్వండి

బచ్చన్నపేట: బతుకమ్మ, దసరా పండుగకు ఏవరైనా ఊరెళ్తే పోలీసులకు సమాచారాం ఇవ్వాలని ఇన్‌చార్జ్ ఎస్సై చెన్నకేశవులు అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాల్ పోస్టర్లను అతికించారు. కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ నూతన కమిటీ ఎన్నిక


రాజు


ప్రవీణ్

జనగామ: జనగామ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ నూతన జిల్లా కమిటీని శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు మల్లిగారి రాజు, అధ్యక్షుడు మిద్దెపాక రాజు, ప్రధాన కార్యదర్శి గడిపె ప్రవీణ్, కోశాధికారి తిప్పారపు కళ్యాణ్, కార్యనిర్వాహణ అధ్యక్షుడు సోమారపు రమేశ్, కొలెపాక ఎల్లయ్య, మహిళా అధ్యక్షుడు గుర్రం లక్ష్మి, సోషల్ మీడియా కన్వీనర్ గుర్రపు నరేశ్, ఉపాధ్యక్షుడు వాతల యాదగిరి, మునిగె కర్ణాకర్, ప్రవీణ్, బాలస్వామి, సభ్యులు రవికుమార్, అశోక్, శ్రీనివాస్, నాగేష్, సునీత, లక్ష్మి, కిష్టయ్య, దేవేంద్ర, పర్శ రాములు, రాములు, రవి, సుశీల, వసంతలను ఎన్నుకున్నారు.

సన్మానం


సాహితను అభినందిస్తున్న ధనలక్ష్మి శ్రీకాంత్

జనగామ రూరల్: పట్టణానికి చెందిన మల్లిగారి రాజు చంద్రకళ దంపతుల కుమార్తె సాహిత, ఇలిటమ్ రవి సుమలత దంపతుల కుమారుడు సుశాంత్, కన్నారపు రజిత నర్సయ్య దంపతుల కుమార్తె రిషిక ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. కాగా, శనివారం జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ చైర్మన్ దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్ ఆధ్వర్యంలో విద్యార్థులను అభినందించి ఘనంగా సన్మానించారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ముందుకు సాగాలి



రఘునాథపల్లి: స్వాతంత్ర సమరయోధుడు, సోషలిస్టు విప్లవకారుడు, బ్రిటీష్ వలస పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన షాహిద్ భగత్ సింగ్ స్ఫూర్తిగా విద్యార్థులు ముందుకు సాగాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పొదల లవకుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని అశ్వరావుపల్లిలో భగత్‌సింగ్ 118వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సాంబరాజు, వంశీ, వెంకటేష్, సాయి శ్రీనాథ్, సాయి పాల్గొన్నారు.

'ఆయుర్వేదం'పై ప్రభుత్వం చిన్నచూపు

- ఏడాదిగా ఆయుర్వేద చికిత్స కేంద్రంలో సేవలు బంద్
- మండల కేంద్రంలో ఆయుర్వేద డాక్టర్ బదిలీ
- ఇబ్బందులు పడుతున్న రోగులు


మూసి ఉన్న నవాబుపేట ఆయుర్వేద చికిత్స కేంద్రం

లింగాలఘణపురం: భారతీయ ప్రాచీన ఆయుర్వేద వైద్యంపై మండలంలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఎన్నో ఏళ్లుగా మండలంలోని ప్రజలకు సేవలు అందిస్తున్న నవాబుపేట ఆయుర్వేద చికిత్స కేంద్రంలో ఏడాదిగా వైద్య సేవలు బంద్ అయ్యాయి. ఇక్కడ పని చేసిన వైద్యురాలు అరుణ హైదరాబాద్ ఎర్రగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ కాగా, ఇక్కడి పోస్టు ఏడాదిగా ఖాళీగానే ఉంటోంది. దీంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు వైద్యుని నియామకం లేదు. నిత్యం నవాబుపేట ఆయుర్వేద వైద్యశాలకు వచ్చే నవాబుపేట పరిసర గ్రామాలైన పటేల్‌గూడెం, వడిచర్ల, కుందారం, కిష్టగూడెం, నెల్లుట్ల తదితరల గ్రామాల రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలోని అయుష్ వైద్యురాలు హరిక రెండు నెలల క్రితం బదిలీపై కామారెడ్డికి వెళ్లింది. దీంతో అసలు మండలంలో ఆయుర్వేద వైద్యం పూర్తిగా దూరమైంది. ఎంతో నమ్మకంతో ఆయుర్వేద మందులు వాడే రోగులు ఏం చేయాలో తోచక అయోమయంలో పడ్డారు. నవాబుపేట వైద్యశాలకు వారానికి రెండు రోజులు జనగామ నుంచి మంగళ, శుక్రవారం కాంపౌండర్ వచ్చి మందులు ఇచ్చిపోతున్నారని గ్రామస్తులు తెలుపుతున్నా.. సమీప గ్రామాల ప్రజలకు సమాచారం కూడా లేదు. ఇకపోతే మండల కేంద్రంలోని ఆయుష్‌లో కూడ ఆయుర్వేద వైద్య సేవలు బంద్ అయ్యాయి. గతంలో ఉన్న మందులను మాత్రమే ఎవరైన అడిగితే ఇస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు స్వర్ణలత తెలిపారు.

ఇబ్బంది పడుతున్నాం..



ఎప్పుడూ ఆయుర్వేద మందులను వాడేటోన్ని.. ఇప్పుడు ఎంతో ఇబ్బంది పడుతున్నా.. డాక్టర్ లేక వైద్య సేవలు అందించే వారు లేరు..వారానికి రెండు సార్లు ఎక్కడి నుంచి కాంపౌండర్ వచ్చి మందులు ఇచ్చిపోతుండు..రెగ్యులర్ డాక్టర్‌ను నియమించి మాలాంటి ఆయుర్వేద మందులు వాడే వారికి మేలు చేయాలి.

- గైని అంజయ్య, నవాబుపేట

శ్రీలలితా త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు


నర్మెట: హన్మంతాపూర్‌లో కుంకుమార్చన చేస్తున్న మహిళలు


రఘునాథపల్లి: కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజ చేస్తున్న మహిళలు

సాక్షి నెట్‌వర్క్: దేవీ నవరాత్రోత్సవాలను జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన మంటపాలలో ప్రతిష్ఠించిన దుర్గామాతా అమ్మవార్ల గ్రహాలకు కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆరవ రోజు శనివారం అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులు ఆరాదించి దూప, దీప నైవేద్యారాధన నిర్వహించి ప్రసాద వితరణ చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


హన్షిక

లింగాలఘణపురం: మండలంలోని పీవీఆర్ పాఠశాల పదో తరగతి విద్యార్థిని పురుషోత్తం హన్షిక నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి 35వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి ఎంపికై పాఠశాలకు, జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తేవాలని విద్యార్థి హన్షికను ఫిజికల్ డైరెక్టర్ కుమార్, ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందించారు.

దేశభక్తి, జాతీయ భావనే లక్ష్యం


నర్మెట: మాట్లాడుతున్న బాల సిద్దయ్య

నర్మెట: మత ఛాందస వాదం కాదు ... ప్రజల్లో జాతీయ భావన, దేశభక్తిని పెంపొందించడమే వందేండ్ల ఘన చరిత్ర కలిగిని ఆర్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యమని రిటైర్డ్ పీజీ హెచ్ఎం, వివేకానంద జిల్లా సమితి సభ్యుడు మేకల బాలసిద్దయ్య అన్నారు. ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని వినాయక గార్డెన్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన విజయదశమి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో స్వయం సేవకులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

దుర్గాష్టమి మహోత్సవం

జనగామ రూరల్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని విజయ దుర్గామాత దేవాలయంలో దుర్గాష్టమి మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుధ పూజ, దుర్గామాత భజన, మహా నక్షత్ర హారతి నిర్వహించారు. కార్యక్రమంలో ములుగు జిల్లా దుర్గావాహిని సంయోజిక్ బొల్లు మణి, జిల్లా దుర్గావాహిని సంయోజిక్ బొల్లు రూప్సీ రాణి, పట్టణ బీజేపీ మహిళా కార్యకర్త నీరజ, పిట్టల శృతి, యక్ష, సాయి వైష్ణవి, భవానీలు, ఆలయ కమిటీ చైర్మన్ పిట్టల సత్యం, వంకుడోత్ అనిత, శ్రీకాంత్, ఉదయ్ తమ్ముడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లింగాలఘణపురంలో..

లింగాలఘణపురం: వ్యక్తి నిర్మాణ ధ్యేయంగా ఆర్ఎస్ఎస్ పని చేస్తుందని జిల్లా సహకార్యవాహ దొంతుల శేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కురుమ సంఘ భవనంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది దసరా ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా సహకార్యవాహ శేఖర్ మాట్లాడుతూ శారీరక, మానసిక ధృఢత్వంతో పాటు జాతీయ భావన, దేశభక్తి పెంపొందించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు మహస్తేశ్, చంద్రశేఖర్, ఎర్రగోకుల మధు, చొదరిపల్లి సతీష్, విజయ్‌కుమార్, నాగరాజు, యాకయ్య, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి


జనగామ రూరల్: నివాళులర్పింస్తున్న జనగామ ఆర్డీఓ గోపిరామ్ తదితరులు


స్టేషన్‌ఘన్‌పూర్: లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఆర్డీఓ డీఎస్ వెంకన్న

సాక్షి నెట్‌వర్క్: తెలంగాణ ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బతుకమ్మ వేడుకలు


దేవరుప్పుల: పెద్దమడూరులో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


జనగామ: పోలీస్‌స్టేషన్‌లో వేడుకల్లో పాల్గొన్న డీసీపీ రాజమహేంద్రనాయక్, సీఐ, తదితరులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో, పలు గ్రామాల్లో శనివారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు, టీచర్లు తదితరులు బతుకమ్మ ఆట ఆడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు ఉన్నారు.

చేనేత రంగం అభివృద్ధికి లక్ష్మణ్ బాపూజీ కృషి


కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఆవిష్కరణలో అతిథులు

జనగామ: చేనేత రంగ అభివృద్ధి కోసం కోసం సహకార సంఘాలు ఏర్పాటు కార్మికులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఆదర్శనీయుడని జిల్లా చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పల్లా చౌడేశ్వరి అన్నారు. జిల్లా కేంద్రంలోని వీవర్స్ కాలనీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఝెన గందుల కృష్ణ, మున్సిపల్ కమీషనర్ మహేశ్వర్ రెడ్డి, సీఐ సత్యనారాయణరెడ్డి, 12వ వార్డు మాజీ కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మి నాగరాజు, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల బాలరాజు, భారతి సొసైటీ అధ్యక్షుడు గుర్రం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఖరారు


స్టేషన్‌ఘన్‌పూర్: రిజర్వేషన్ల వివరాలను తెలుపుతున్న ఆర్డీఓ డీఎస్ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఆశావహులు, ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఎట్టకేలకు ఖరారయ్యాయి. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో డీపీఓ స్వరూప రాణి, ఆర్డీఓ డీఎస్ వెంకన్న ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో రిజర్వేషన్లు ఖరారు చేయడంతో గ్రామాల్లో కొన్ని నెలలుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. గ్రామాల వారీగా రిజర్వేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి. మండలపరిధిలో ప్రస్తుతం ఉన్న 15 గ్రామాలకు గాను సర్పంచ్‌లకు ఎస్టీకి రెండు, బీసీకి ఆరు, ఎస్సీకి నాలుగు, జనరల్‌కు మూడు స్థానాలను కేటాయించారు. చంద్రుతండా-ఎస్టీ మహిళ, జిట్టెగూడెం తండా ఎస్టీ జనరల్, కోమటిగూడెం, ఇప్పగూడెం, నమిలిగొండ గ్రామాలు బీసీ మహిళ, పాంనూర్, సముద్రాల, రాఘవాపూర్ బీసీ జనరల్‌గా ఖరారు చేశారు. అక్కపెల్లిగూడెం, విశ్వనాథపురం ఎస్సీ మహిళకు కేటాయించగా మీదికొండ, తాటికొండ ఎస్సీ జనరల్‌కు ఖరారు చేశారు. తానేదార్‌పల్లి జనరల్ మహిళ, కొత్తపల్లి, రంగరాయగూడెం గ్రామాలు జనరల్ స్థానాలుగా నిర్ణయించారు. అదేవిధంగా మండల పరిధిలోని తొమ్మిది ఎంపీటీసీ స్థానాలకు ఎస్సీ-2, బీసీ-4, జనరల్-3 కేటాయించారు. తాటికొండ-2 ఎంపీటీసీ స్థానం ఎస్సీ మహిళ, నమిలిగొండ ఎస్సీ జనరల్ కాగా పాంనూర్, ఇప్పగూడెం-2 స్థానాలు బీసీ మహిళ, మీదికొండ, సముద్రాల స్థానాలు బీసీ జనరల్‌గా కేటాయించారు. అదేవిధంగా తాటికొండ-1 స్థానం జనరల్ మహిళకు, తానేదార్‌పల్లి, ఇప్పగూడెం-1 స్థానాలను జనరల్‌కు కేటాయించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ విజయశ్రీ, ఎంపీఓ నర్సింగరావుతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వార్డుల రిజర్వేషన్లు..

మండలంలోని వివిధ గ్రామపంచాయతీలకు చెందిన వార్డుల రిజర్వేషన్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖరారు చేసినట్లు డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి తెలిపారు. వార్డుల రిజర్వేషన్ల ఖరారు కోసం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో డీఎల్‌పీఓ, ఎంపీడీఓ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ చేపట్టారు. గతంలో మండల పరిధిలో 18 గ్రామాలు ఉండగా ఇటీవల నూతనంగా ఏర్పడిన స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోకి స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు వెళ్లాయి. దాంతో ప్రస్తుతం మండలంలో ఉన్న 15 గ్రామాలకు గాను పంచాయతీరాజ్ నిబంధనల మేరకు వార్డుల రిజర్వేషన్ల ఖరారు చేశామని డీఎల్‌పీఓ తెలిపారు. మండలంలో మొత్తం 146 వార్డులుండగా ఎస్టీకి-18, ఎస్సీకి-38, బీసీలకు-56, జనరల్‌కు-34 స్థానాలు కేటాయించినట్లు తెలిపారు. మొత్తంగా అన్ని వార్డులకు కలిపి మహిళలకు 63 స్థానాలు కేటాయించారు. కాగా సదరు రిజర్వేషన్ల వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదికను అందిస్తామని, తదుపరి కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలకు అధికారికంగా అందిస్తామని పేర్కొన్నారు. ఎంపీడీఓ విజయశ్రీ, ఎంపీఓ నర్సింగరావు, సూపరింటెండెంట్ కృష్ణ పాల్గొన్నారు.

కొడకండ్ల మండలంలో..

కొడకండ్ల: మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ రిజర్వేషన్లు శనివారం అధికారులు ఖరారు చేసారు. ఎంపీపీ పదవి జనరల్‌కు రిజర్వు కాగా తొమ్మిది ఎంపీటీసీలకు గాను లక్ష్మక్కపల్లి(బీసీ మహిళ), రామన్నగూడెం(జనరల్), మొండ్రాయి (బీసీ జనరల్), రామవరం(ఎస్సీ జనరల్), పాకాల (ఎస్టీ జనరల్), కొడకండ్ల-1(బీసీ జనరల్), కొడకండ్ల-2(ఎస్టీ మహిళ), ఏడునూతుల(బీసీ మహిళ), రంగాపురం(ఎస్టీ జనరల్)కు కేటాయిస్తూ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఎంపీపీ జనరల్, జెడ్పీటీసీ జనరల్ మహిళకు కేటాయించారు. అలాగే 21 గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. లక్ష్మక్కపల్లి(ఎస్సీ మహిళ), పెద్ద బాయితండ(జనరల్), రామన్నగూడెం(బీసీ మహిళ), బోడోనికుంటతండ(ఎస్టీ మహిళ), మొండ్రాయి(బీసీ జనరల్), గిర్నితండ(జనరల్ మహిళ), మైదంచెరువుతండ(ఎస్టీ మహిళ), నీలిబండతండ(ఎస్టీ జనరల్), సీఎం తండ(ఎస్టీ జనరల్), రామేశ్వరం(ఎస్టీ జనరల్), రామవరం(బీసీ జనరల్), పాకాల(బీసీ మహిళ), కడగుట్టతండ(ఎస్టీ జనరల్), కొడకండ్ల(జనరల్), హక్యాతండ(ఎస్టీ మహిళ), గుమ్ముల్లబండతండ(ఎస్టీ జనరల్), నర్సింగాపురం(ఎస్సీ జనరల్), ఏడునూతుల(బీసీ జనరల్), రంగాపురం(బీసీ మహిళ), రేగుల(ఎస్సీ మహిళ), రేగుల(ఎస్సీ మహిళ), రేగులతండ(ఎస్టీ మహిళ) సర్పంచ్ రిజర్వేషన్లు ఖరారయ్యాయి.

రఘునాథపల్లి..

రఘునాథపల్లి: రఘునాథపల్లి జడ్పీటీసీ (బీసీ మహిళ), ఎంపీపీ (బీసీ జనరల్) కాగా శివాజీనగర్, ఖిలాషాపూర్, బానాజీపేట ఎంపీటీసీ స్థానాలు (బీసీ మహిళ), కంచనపల్లి, నిడిగొండ, నారాయణపురం (బీసీ జనరల్), మేకలగట్టు(జనరల్ మహిళ) , గోవర్దనగిరి, అశ్వరావుపల్లి (ఎస్సీ మహిళ), కుర్చపల్లి, రఘునాథపల్లి(ఎస్సీ జనరల్), ఫతేషాపూర్ (ఎస్టీ మహిళ) మండలగూడెం (ఎస్టీ జనరల్), మంగళిబండతండా, గబ్బెట(జనరల్) స్థానాలు కేటాయించారు.

బచ్చన్నపేట..

బచ్చన్నపేట: మండలంలోని 26 గ్రామ పంచాయతీలలో 238 వార్డుల రిజర్వేషన్‌లను ఖరారు చేసినట్లు ఎంపీడీఓ మమతాబాయి తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో పలు పార్టీల నాయకుల సమక్షంలో వార్డుల రిజర్వేషన్‌లను ప్రకటించారు. ఈ రిజర్వేషన్లలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలుపాలని పలు పార్టీల నాయకులను కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటమల్లి కార్జున్, నాయకులు పాల్గొన్నారు.

దేవరుప్పుల మండలంలో..

దేవరుప్పుల: స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియ జనగామ ఆర్డీఓ కార్యాలయంలో మండల రాజకీయ పార్టీల సమక్షంలో నిర్ధారించారు. ఈ మేరకు దేవరుప్పుల ఎంపీటీసీ (బీసీ జనరల్), కామారెడ్డిగూడెం (ఎస్సీ మహిళ), ధర్మాపురం (జనరల్ మహిళ), కడవెండి (ఎస్టీ మహిళ), సీతారాంపురం (ఎస్టీ జనరల్), మాదాపురం (బీసీ మహిళ), కోలుకొండ (జనరల్), అప్పిరెడ్డిపల్లె (ఎస్సీ జనరల్), చిన్నమడూరు (బీసీ జనరల్), పెద్దమడూరు (బీసీ మహిళ), సింగరాజుపల్లి (ఎస్టీ జనరల్), నీర్మాల బీసీ జనరల్‌గా కేటాయించారు. అలాగే మండల పరిషత్‌లో ఎంపీడీఓ టి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో 32 గ్రామ పంచాయతీల్లో వార్డు రిజర్వేషన్ కేటాయింపునకు డ్రా పద్ధతిన నిర్ధారించారు. ఈ మేరకు బీసీ జనరల్-46, బీసీ మహిళ-37,ఎస్సీ జనరల్-25, ఎస్సీ మహిళ-15, ఎస్టీ జనరల్-41, ఎస్టీ మహిళ-35, జనరల్ కేటగిరి జనరల్-43, జనరల్ మహిళకు-32 చొప్పున కేటాయించారు.

నర్మెట..

నర్మెట: స్థానిక సంస్థల ఎన్నికల అభ్యర్థుల రిజర్వుడు స్థానాలను ప్రకటించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ అరవింద్ చౌదరి 17 గ్రామ పంచాయతీల 148 వార్డు సభ్యుల రిజర్వేషన్ వివరాలను శనివారం ప్రకటించారు. మండలంలో 17 గ్రామ పంచాయతీలుండగా ఎస్టీ -7 (జనరల్ -4, మహిళ -3), బీసీ -7 (జనరల్ -4, మహిళ -3), ఎస్సీ 3 (జనరల్ -2, మహిళ-1) సర్పంచ్ స్థానాలు కాగా, వార్డు సభ్యులు ఎస్సీ -22 (జనరల్13 , మహిళ-9), ఎస్టీ 56 (జనరల్ -28, మహిళ -28), బీసీ- 39 (జనరల్- 21, మహిళ -18), అన్ రిజర్వ్‌డ్ -31 (జనరల్ 18, మహిళ 13). జెడ్పీటీసీ బీసీ జనరల్, ఎంపీపీ బీసీ జనరల్ , ఎంపీటీసీలు -7 స్థానాలకు ఎస్సీ జనరల్ -1, బీసీ జనరల్ -2, ఎస్టీ జనరల్ -1, అన్ రిజర్వ్‌డ్ -1, బీసీ మహిళ -1, ఎస్టీ మహిళ-1 స్థానాలుగా ప్రకటించారు.

జఫర్‌గఢ్..

జఫర్‌గఢ్: మండలానికి సంబంధించిన సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లను అధికారులు ఖారారు చేశారు. మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలకు ఓబులాపూర్ (ఎస్టీ జనరల్), కూనూర్ (ఎస్సీ జనరల్), తిమ్మంపేట (ఎస్సీ మహిళ), హిమ్మత్‌నగర్ (ఎస్సీ జనరల్), ఉప్పుగల్లు (బీసీ మహిళ), సాగరం (బీసీ జనరల్), తీగారం (బీసీ జనరల్), రఘునాథ్‌పల్లి (బీసీ మహిళ), జఫర్‌గఢ్-2 (బీసీ జనరల్), జఫర్‌గఢ్-1, తమ్మడపల్లి (జి) (అన్ రిజర్వ్‌డ్), కోనాయిచలం (అన్ రిజర్వ్‌డ్ మహిళ). మండలంలోని సాగరం సర్పంచ్ స్థానానికి (ఎస్సీ జనరల్), కోనాయిచలం (ఎస్సీ మహిళ), తిమ్మాపూర్ (ఎస్సీ జనరల్), ఓబులాపూర్ (ఎస్సీ మహిళ), రఘునాథ్‌పల్లి (ఎస్సీ జనరల్), షాపల్లి (బీసీ జనరల్), హిమ్మత్‌నగర్ (బీసీ మహిళ), జఫర్‌గఢ్ (బీసీ మహిళ), ఉప్పుగల్లు (బీసీ జనరల్), సూరారం (బీసీ జనరల్), తీగారం (బీసీ మహిళ), కూనూర్ (బీసీ మహిళ), తమ్మడపల్లి (ఐ) (బీసీ జనరల్), తమ్మడపల్లి (జి) (అన్ జనరల్), తిమ్మంపేట (అన్ జనరల్ మహిళ), తిడుగు (అన్ రిజర్వ్‌డ్ మహిళ), మగ్దుంతండా (అన్ రిజర్వ్‌డ్), రేగడితండా (ఎస్టీ మహిళ), అల్వార్‌బండాతండా (ఎస్టీ మహిళ), లక్ష్మీనాయక్‌తండా (ఎస్టీ జనరల్), దుర్గ్యానాయక్‌తండా (అన్ రిజర్బ్‌డ్ జనరల్)గా ఖారారు కావడం జరిగింది.

లింగాలఘణపురం..

లింగాలఘణపురం: మండలంలో సర్పంచ్, ఎంపీటీసీలతో పాటు ఎంపీపీ, జడ్పీటీసీలతో పాటు వార్డు సభ్యుల రిజర్వేషన్లు శనివారం అధికార యంత్రాంగం ఖరారు చేసింది. ఇందులో ఎంపీపీ ఎస్సీ జనరల్ కాగా, జడ్పీటీసీ ఎస్సీ మహిళ అయ్యింది. 21 గ్రామ పంచాయితీల్లో ఎస్సీ-5, ఎస్టీ-1, బీసీ-9, జనరల్-6, 11 ఎంపీటీసీలకు గాను ఎస్సీ-3, బీసీ-5, జనరల్-3, కాగా 21 పంచాయితీల్లో 196 వార్డు ఉండగా అందులో ఎస్సీ-42, ఎస్టీ-06, బీసీ-85, అన్‌రిజర్వ్‌డ్-63 ఉన్నాయి.

పాలకుర్తి..

పాలకుర్తి టౌన్: పాలకుర్తి మండల స్థానిక సంస్థల ఎన్నికల అభ్యర్థుల స్థానాలకు శనివారం ప్రకటించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లను ప్రభుత్వం అమలు చేయడంతో పాలకుర్తి ఎంపీపీతోపాటు జెడ్పీటీసీ స్థానాలను బీసీ మహిళలకు రిజర్వు చేశారు. పాలకుర్తి మండలంలో 17 ఎంపీటీసీ స్థానాలకు ఎస్టీలకు- 3,ఎస్సీలకు- 3, బీసీలకు-7, జనరల్-4 స్థానాలను కేటాయింస్తూ రిజర్వేషన్లును అధికారులు ఖరారు చేశారు.స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీఓ డీఎస్ వెంకన్న ఆధ్వర్యంలో ప్రాదేశిక స్థానిక సంస్థల రిజర్వేషన్లను ఖరారు చేశారు. మండలంలోని 38 గ్రామాలకు సర్పంచ్ అభ్యర్థుల రిజర్వేషన్లను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవీందర్ మాట్లాడుతూ 38 గ్రామ పంచాయతీలో ఎస్టీలకు-11,బీసీలకు-13, ఎస్సీలకు-6, జనరల్-8, 336వార్డు సభ్యుల రిజర్వేషన్లలో ఎస్టీలకు-94,ఎస్సీలకు-49, బీసీలకు -105, జనరల్- 88 వార్డులను కేటాయిస్తూన వార్డుల వారీగా రిజర్వేషన్లును ఖరారు చేసినట్లు ఎండీపీఓ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

వాగులో పారబోసిన పటిక, బెల్లం

దేవరుప్పుల: అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన గుడుంబా తయారీ వస్తువులను ఎక్సైజ్ జిల్లా శాఖ ఆదేశాల మేరకు దేవరుప్పుల వాగులో శనివారం కలిపారు. ఎస్సై ఊర సృజన్‌కుమార్ కథనం మేరకు .. ఆరు నెలల కింద సింగరాజుపల్లి టోల్‌గేట్ వద్ద సమాచారం మేరకు తొర్రూరు మండలం జెట్రాంతండాకు జాటోత్ నవీన్ టాటా ఏస్ వాహనంలో 20 క్వింటాళ్ల నల్లబెల్లం, 30 కిలోల పటికి లభ్యమవ్వగా కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ జిల్లా అధికారి ఆదేశానుసారం సీఐ సంతోష్‌రెడ్డి పర్యవేక్షణలో దేవరుప్పుల వాగు వద్ద సదరు పట్టుకున్న గుడంబా తయారీ సామగ్రిని వాగులో పారబోశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో ఈనెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బత్తుల రమేశ్ (36) హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. చిల్పూరు మండలం కొమ్ముగుట్టకు చెందిన రమేష్ గత కొన్నేళ్లుగా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం విశ్వనాథపురంలో నివాసం ఉంటున్నారు. గంగిరెద్దులను ఆడించే పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే ఈనెల 21న వ్యక్తిగత పనులపై స్టేషన్‌ఘన్‌పూర్‌కు మోటార్‌బైక్‌పై వచ్చి తిరిగి విశ్వనాథపురంకు వెళ్తుండగా శివునిపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అందించిన సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మూడురోజుల క్రితం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పిడుగు పాటుకు గేదె మృతి

బచ్చన్నపేట: ప్రమాదవశాత్తు పిడుగు పాటుకు సూడి గేదె మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగింది. మండల కేంద్రానికి చెందిన చిట్టి రాంరెడ్డి రోజు మాదిరిగా తన వ్యవసాయ బావి వద్ద పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. ఉదయం వెళ్లి చూసే సరికి ఓ సూడి గేదె విగతజీవిగా పడి ఉంది. రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగుపాటుకు సూడి గేదె మృతి చెందిందని, దాని విలువ రూ. 1.20 లక్షలు ఉంటుందని రోదిస్తూ తెలిపాడు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం



పాలకుర్తి: భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ నాగేశ్వరాచారి అన్నారు. శనివారం మండలంలోని మల్లంపల్లి, మంచుప్పుల, కోతులబాద గ్రామాల్లో నిర్వహిస్తున్న సాదాబైనామా దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్ఐ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

కొడకండ్ల: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు దరి చేరకుండా జాగ్రత్త వహించవచ్చని ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ జాంబ కోరారు. శనివారం కొడకండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మొండ్రాయిలోని పల్లె దవాఖాన, గ్రామ పంచాయతీ, ఎస్సీ కాలనీ, ప్రధాన కూడాళ్లలో పిచ్చి మొక్కలను తొలగించి శ్రమదానం చేశారు. సైడ్‌డ్రైయినేజీలను కూడా శుభ్రం చేసి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం..

చిల్పూరు: గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకే స్వచ్ఛతా హే సేవ కార్యక్రమమని, అందుకు ప్రజలు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి చుక్క లింగయ్య అన్నారు. లింగంపల్లి గ్రామంలో స్వచ్ఛత హే సేవ కార్యక్రమంలో భాగంగా వార్డుల్లో రోడ్ల వెంట పెరిగిన పిచ్చి మొక్కలను తీయించి శుభ్రం చేయించారు.